


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -167-

**(31 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**అవహేళనలు** మగవాళ్ళల్లోనూ వున్నాయి. సామాన్యుల్లో మాటేమిటి? పెద్ద పెద్ద వాళ్ళలో కూడా వున్నాయి. కవుల్లో కూడా వున్నట్లు చెప్పుకుంటూ వుండేవారు. "ఆయన కవిత్వమేమిటి? అధ్వాన్నం కవిత్వం" అని ఒకరంటే "ఆయనకు అసలు ఛందస్సే సరిగ్గా రాదు.. పైకి మాత్రం బంధకవిత్వం వ్రాస్తానంటూ బడాయిలు కొడుతూ వుంటాడు" అని అనుకునేవారూ వుండేవారుట.

అలాటి ఆక్షేపణలు కొద్ది తరహాలో ఎప్పుడూ వుంటాయనే చెప్పాలి. "ఆయన వ్రాసిన పద్యాలు ఆయన భార్యాపిల్లలూ వినవలసిందే. అది నా అనుమానమే. దాంట్లో భావమా! భాషా! రసపోషణా!" అంటూ దూషించేవారూ కొందరుంటారు.

ఏదోవిధంగా ఎదటి రచనల్ని తేలిక పరచటం కొందరికి మంచి హాబీ. జెలసీ పేరిట బేబీని ఎత్తుకుని, పరదూషణ పేరిట పాలపీక నోట్లోపెట్టి త్రాగిస్తూ, ఆడిస్తూ వుండటం కొందరు మహానుభావుల నిత్యకృత్యం.

బాగోగుల్ని అవగాహన చేసుకుని మనస్సు దాచుకోవడం మంచిదనే సంగతి వారికి తట్టదు పాపం. ప్రచారంలోకి దిగితే కాని ప్రాణికి సంతృప్తి వుండదు. మంచి అంటేనే వారికి ఎలర్జీ పాపం. ఏం చేస్తాం?

రచయితల్లో ఏమిటి రాజకీయవేత్తల్లో కూడా ఈ అవహేళన మరీ పరాకాష్ట చెందుతూ వుంటుంది. ఎంతసేపూ ఎదుటి వాళ్ళను చూసి ఎక్కిరించడమే.. అదేదో వారికి పంచదార బొక్కినట్లుంటుంది కాబోలు. ఏ నాయకుని పేరన్నా చెప్పండి – వాళ్ళ పక్షానికి చెందనివాడయితే సరి ఇక ప్రారంభవుతుంది అవహేళన.

"అతడికేం తెలుసు పది మాటలు నేర్చుకుని బయలుదేరాడు. ఎదుట వాళ్ళను ఎక్కిరించడంతో రాజకీయ దురంధరత్వం అలవడుతుందని ఆశ పాపం. "దేశానికి మంచిరోజులు లేక అలాంటివారంతా నాయకులయ్యారు. హా! భారతమాతా! ఎట్టి దుస్థితి వాటిల్లినది తల్లీ నీకు!?" అని నాటకం భాషలోకి పోయి నానాగందరగోళం చేసి వదిలిపెడుతూ వుంటారు.

ఇలా నాయకుల్ని నాయకులు అవహేళన చేసుకోవడం పరిపాటి అయింది. ఎవరికైనా రాజకీయమైన లోపాలుంటే వాటిని వెల్లడించుకోవడం సముచితంగాని, వీరితో పోల్చి, వారితో పోల్చి సంతృప్తి చెందడం అంత మర్యాదగా వుండదేమోననిపిస్తుంది.

ఒకప్పుడు ఎంతో పవిత్రమైన సంస్థగా భావించి, పూజించిన కాంగ్రెసులోనే విభాగాలేర్పడి ఒకరిని ఒకరు ఆక్షేపించుకుంటూ వుండటం గమనిస్తూనే వున్నాం. అవహేళన ఒక కళగా మారిపోతోంది అన్ని రంగాలలో. పదవులు ఒకప్పుడు రంగుల సింహాసనాలమీద కూర్చోబెట్టి, బంగారు గంటల చప్పుళ్ళు వినిపిస్తాయి. కొంతకాలం పోయిన తర్వాత శృంగభంగం కావచ్చు. ఈ సత్యాన్ని వల్లించకుండా పదవుల శాశ్వతత్వాన్ని ఆశించడం వల్ల కొంత ప్రమాదం వుంది. ఇటీవల కేంద్రమంత్రి శ్రీ రఘురామయ్యగారన్నారు: "పదవులు అశాశ్వతం – ప్రజాదరణ శాశ్వతం" అని. ఇది గుర్తించినవారు అవహేళనపాలు కారు.

ఒక వర్గం పదవి స్వీకరించినప్పటి నుంచీ తక్కిన వర్గాలు ఆక్షేపణలు ప్రారంభిస్తారు.. "అట్టేకాలం వుండదీ ప్రభుత్వం" అని ఘంటాపథంగా చెప్పడం ప్రారంభిస్తారు. "డిల్లీ సుల్తాన్ పట్టుకుపోతాం, మూడే నెలల్లో పట్టుకుపోతాన్" అన్న యుగంధర గీతం ఎందరి గొంతుల్లోనో వినిపించడం ప్రారంభిస్తుంది.

ఈ సందర్భంలో నాకో విషయం జ్ఞాపకం వచ్చింది. మా బంధువుల్లో ఒకాయన చేసుకున్న భార్యను వదిలివేశాడు. తనకు నచ్చలేదని. పాపం ఆవిడకు మాట కొంచెం తొట్రుపాటుతో వచ్చేది. భర్త వదిలిన తర్వాత ఆమె ఎంతో వ్యధ చెందుతూ వుండేది. ఆయనగారు మరో పెళ్ళి చేసుకున్నారు.

విడిచిపెట్టబడిన ఆవిడ ఎవరు కనిపించినా ఇలా అంటూ వుండేది. "మళ్ళీ చేసుకుంటే మాత్రం ఆ వంశం నిలుస్తుందంటారా! వట్టిది. ఆయనకు పిల్లలు పుట్టరు. పుట్టినా మొగపిల్లలు పుట్టరు ఒకవేళ పుట్టినా బ్రతకరు" అని.

"అలా అనకూడదమ్మా ఎవళ్ళ పాపం వాళ్ళది" అని ఎవరన్నా అంటే “నేనూ ఆ మాటే అంటున్నా. ఆయన పాపం ఆయనకే కొడుతుంది. నా ఉసురు దాకా అక్కర్లా. మొగపిల్లలు పుట్టరు. పుట్టినా బ్రతకరు" అనేది.

రాజకీయ నాయకుల ప్రవచనాలూ ఇలాగే వుంటున్నాయి. "వాళ్ళు అట్టేకాలం పదవుల్లో వుండరు. వున్నా దేశానికేం చెయ్యలేరు.” పైన చెప్పినావిడ "పుడితే ఆడపిల్లలు పుడతారుగాని, మగపిల్లలు పుట్టరు" అన్నట్లుగా, వీరు "చేస్తే దేశానికి చెడు చేస్తారుగాని మంచి ఏమీ చెయ్యరు" అని ఘంటా పథంగా చెపుతున్నారు.

ఆక్షేపించేవారు అందల మెక్కితే నిక్షేపంలాంటి దేశం నీళ్ళు కారిపోయింది అని ఒక శాస్త్రం వుంది. ఆక్షేపణలతో కాలం గడిపేవారి చిత్తవృత్తి నిలకడగా వుండదు. పదవి అలంకరించిన తర్వాత తన ఆక్షేపణలు తనకే జ్ఞాపకం వచ్చి తత్తర బిత్తరలాడటంతో సరిపోతుంది.

చిన్న తరహా, చిలిపి తరహా నాయకుల హేళన చేశారంటే కొంత ఆస్థివుంది. పెద్దపెద్ద వారే ఆ పనికి పూనుకోవడం ఏమంత బాగుంటుంది . ఇటీవల ఒక నాయకుడు కాంగ్రెసు ప్రభుత్వాన్ని పిండారీలతో, థగ్గులతో పోల్చారు. వాళ్ళు తమర్ని మహారాజులుగా సంబోదించుకునేవారు. వీరు మంత్రులుగా సంబోధించుకుంటున్నారన్నారు.

మనదేశంలో ఏమిటి? అన్ని దేశాలలో ఇలాటి అవహేళనలు జరుగుతూనే వుంటాయి. అవి వినడానికి తమాషాగా వున్నా అనిపించుకునే వారికి కొంచెం  కష్టంగానే వుండవచ్చు. అయినా ఇవి నిత్యకృత్యం అయిపోతున్నాయి గనుక పట్టించుకోవడం, బాధ పడటం జరగడం లేదు.

వెనుక చర్చిల్ అంతవాడు గాంధీజీని "కొల్లాయి పకీరు" అని హేళన చేశాడు. ఆయన ఎంతటివాడో తర్వాత అర్ధం చేసుకున్నాడు. బ్రిటిష్ ప్రభుత్వమే ఆయనకి కిరీటంకాని కిరీటం పెట్టి గౌరవించింది. అప్పుడు చర్చిల్ నాలిక ఎన్ని ముడతలు పడిందో. తనను తానే చిన్నపుచ్చుకున్నంత పని అయింది.

అవహేళన ఒక ఆర్టు కాదు. ఎవరి తేలికతనాన్ని గురించి వారు ప్రకటించుకునే రిపోర్టు. వారి గుణగణాలకు సంబంధించిన చార్టు.

Post your comments